క్లుప్తంగా

పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



ఇఫ్తార్‌విందులో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని షేర్‌ఖాన్‌పల్లిలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టి ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, జెడ్పీటీసీ ఆంజనేయులు, పీఎస్ఏ చైర్మన్ దుర్గారెడ్డి, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందజేత



క్రీడా సామగ్రిని అందజేస్తున్న విక్రంరెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అనంతారం గ్రామంలోని క్రీడాకారులకు ఎమ్మెల్యే తనయుడు, బీఆర్ఎస్ యువజన నాయకుడు గూడెం విక్రంరెడ్డి సోమవారం క్రీడా సామగ్రిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేవిధంగా సహకారం అందిస్తున్నామన్నారు. యువత అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు హుస్సేన్, నాయకులు నరేందర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వండి



అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ చౌరస్తాలో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ సోమవారం సంగారెడ్డిలో ప్రజావాణిలో పాల్గొన్న అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ శ్రీశైలం, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల కూల్చివేతను విరమించుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో 59జీవో ద్వారా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నా రుసుం చెల్లించకపోవటంతో రెవెన్యూ అధికారులు ఇళ్లను కూల్చివేసేందుకు సోమవారం చర్యలు చేపట్టారు. దీంతో స్థానిక కౌన్సిలర్, బీఆర్ఎస్ నేత చంద్రారెడ్డి, బీజేపీ నేత ఆనంద్ కృష్ణారెడ్డి బాధితులతో కలిసి ఇళ్ల కూల్చివేతను విరమించాలని అధికారులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ నిరుపేదలైన తమకు ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు రూ.లక్షలు చెల్లించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కంటే ఎక్కువ రుసుంను చెల్లించాలని అధికారులు సూచిస్తున్నారని బాధితులు వాపోయారు. తమకు ఎమ్మెల్యే, కలెక్టర్ న్యాయం చేయాలని బాధితులు కోరారు.

ఈద్గాలో పారిశుధ్య పనులు

నారాయణఖేడ్: పట్టణంలోని ఈద్గాలో సోమవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పరిశుభ్రత, పారిశుధ్య పనులను చేపట్టారు. మరో ఐదు రోజుల్లో రంజాన్ పండుగ ఉండటంతో ఈద్గాతో పాటు చుట్టుపక్కల ఆవరణల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించినట్లు మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

మన ఊరు - మనబడి పనుల పరిశీలన

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని నందికంది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న మనఊరు మనబడి పనులను సోమవారం ఎంఈఓ దండు అంజయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80శాతం పనులు పూర్తి అయినట్లు తెలిపారు. మిగతా పనులను త్వరలోనే పూర్తిచేస్తామన్నారు.

మినీ గురుకులం పరిశీలన

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలంలోని బాచేపల్లిలో గిరిజన బాలికల మినీ గురుకుల పాఠశాలను సోమవారం కల్హేర్ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నీటి సమస్య తీర్చేందుకు కొత్తగా వేయించిన బోరుమోటారును పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజిత, పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి పాల్గొన్నారు.

దామరచెరువు వెలవెల

- నీరులేక అడుగంటుతున్న బోర్లు
- ఎండుతున్న పంటలు
- ఆందోళనలో చింతకుంట రైతులు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



చింతకుంట దామర చెరువు

జోగిపేట(అందోల్): ఆరేళ్లుగా చుక్కనీరు చెరువులోకి రాకపోవడంతో చింతకుంట గ్రామానికి చెందిన రైతులు సోమవారం మెదక్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అన్నాసాగర్ పెద్దచెరువు నుంచి దానంపల్లి మీదుగా కాలువ ద్వారా అందోలు మండలం చింతకుంట గ్రామంలోని దామర చెరువులోకి నీరు రావాల్సి ఉంటుంది. కానీ.. కాలువలో పిచ్చి మొక్కలు పెరగడంతో నీరు బయటకు రాకుండా అక్కడే నిల్వ ఉంటుంది. దీంతో ఇదే అదునుగా కొంతమంది రైతులు మోటార్ల ద్వారా నీటిని మళ్లించుకుంటున్నారు. ఫలితంగా దిగువన ఉండే రైతులు పంటలు నీరందక ఎండిపోతుండటంతో ఆందోళనకు గురవుతున్నారు.

వినియోగానికి నోచుకోని మోటార్లు...

దామర చెరువు విస్తీర్ణం 70ఎకరాలు కాగా ఆయకట్టు 125 ఎకరాల వరకు ఉంది. చెరువు దిగువన 50 నుంచి 60 వరకు బోరుబావులుండగా ఇప్పటికే 30 బోరుమోటర్లలో నీరు లేకపోవడంతో వినియోగానికి నోచుకోవడంలేదు. ఫలితంగా రైతులు పంటలను పండించేందుకు సాహసించలేకపోతున్నారు.

అర ఎకరం పంటనైనా దక్కించుకోవాలని...

తనకున్న అర ఎకరం భూమిలో వేసిన వరి పంటను దక్కించుకునేందుకు రైతు చాకలి యాదయ్య చిన్న కాలువలో ఉన్న నీటిని గంప ద్వారా తమ పొలం వైపు మళ్లించుకునేందుకు ప్రతిరోజు కష్టపడుతున్నాడు. రోజు 4 గంటల పాటు గంప ద్వారా భార్యాభర్తలు నీటిని తమ పొలం కాలువవైపు ఎత్తి పోసుకుంటారని గ్రామస్తులు తెలిపారు. అర ఎకరా భూమిలో వేసిన పంటను దక్కించుకునేందుకు అష్ట కష్టాలు పడాల్సి వస్తుందని రైతు యాదయ్య 'సాక్షి'తో ఆవేదన వ్యక్తం చేశారు.



శిథిలావస్థలో అలుగు

శిథిలావస్థలో అలుగు...

చెరువు నుంచి గ్రామంలోని కాలువలకు నీరు మళ్లించే అలుగులు పిచ్చి మొక్కలతో కనిపించకుండా దర్శనమిస్తున్నాయి. గ్రామంలోని బోర్లు సైతం అడుగంటిపోవడంతో అందరిచూపు చెరువుపై పడింది. చెరువులోకి నీరు వస్తే బోర్ల ద్వారా పంట పొలాలకు నీరు సరఫరా చేసుకోవచ్చని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి అన్నాసాగర్ చెరువు నుంచి చింతకుంట దామర చెరువులోకి నీరు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

'పేపర్ లీకేజీ ప్రభుత్వ వైఫల్యమే'



మాట్లాడుతున్న తుల్జారెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వ వైఫల్యం కారణంగానే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ అయ్యిందని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు తుల్జారెడ్డి అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని ఓ హోటల్‌లో టీజేఎస్ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తుల్జారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నోటిఫికేషన్‌లు విడుదల చేయడంతో నిరుద్యోగులు ఎంతో సంబురపడ్డారని, కానీ పేపర్ లీకేజీతో వారి ఆశలు అడియాసలు అయ్యాయని వాపోయారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు నిరుద్యోగులు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు జూలకంటి ఆంజనేయులు, బీఎస్పీ జిల్లా నాయకులు మల్లయ్య, ఆప్ జిల్లా నాయకులు పట్లోళ్ల సంతోష్‌రెడ్డి, తెలంగాణ జన సమితి మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, యువజన సమితి జిల్లా అధ్యక్షుడు పాండు, ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మహేష్ పాల్గొన్నారు.

ఇఫ్తార్‌విందుకు ఎమ్మెల్యే హాజరు



ఇఫ్తార్‌విందులో ఎమ్మెల్యే మాణిక్‌రావు

కోహీర్(జహీరాబాద్): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కోహీర్ పట్టణంలోని ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్‌విందులో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, తెలంగాణ రాష్ట్ర ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నర్సింహులు యాదవ్, పట్టణ అధ్యక్షులు ఇష్తాకార్, ఆయా గ్రామాలసర్పంచులపాల్గొన్నారు.

పర్యవేక్షణ లేకనే విద్యార్థుల మృత్యువాత

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం

కొండాపూర్(సంగారెడ్డి): ఆర్సీఓల పర్యవేక్షణ లేకపోవడంతోనే గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నారని, ఆయా ఘటనలపై సమగ్ర విచారణ జరపాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డిలోని కేవీపీఎస్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ ఇటీవల నారాయణఖేడ్ గిరిజన గురుకులంలో విద్యార్థి అదృశ్యమై చెరువులో శవమై తేలాడని, సిర్గాపూర్ ఎస్టీ గురుకులంలో ఇంటర్ విద్యార్థిని రెండంతస్తుల పైనుంచి పడి చనిపోయిందని, సిర్గాపూర్ మైనార్టీ గురుకులంలో ఇంటర్ విద్యార్థిని గర్భం దాల్చిందని, గతంలో ముత్తంగి మహాత్మ జ్యోతిబాపూలే గురుకులంలో ఇంటర్ విద్యార్థిని చనిపోయిందని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ఆర్సీఓల పర్యవేక్షణ ఏమైందని ప్రశ్నించారు. సంబంధిత ఆర్సీఓలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇల్లు, మూడెకరాల భూమి ఇచ్చి ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

విశ్వాసాలకు ప్రతీక రంజాన్



ఇఫ్తార్‌విందులో దామోదర రాజనర్సింహ

పుల్‌కల్(అందోల్): రంజాన్ విశ్వాసాలకు, నమ్మకాలకు ప్రతీక అని మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహఅన్నారు. మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి, నాయకులు పడమటి యాదగిరి, మల్లేశంగౌడ్, మహ్మద్‌అసన్ పాల్గొన్నారు.

'ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి'

కొండాపూర్(సంగారెడ్డి): జహీరాబాద్ మండల విద్యాధికారి బస్వరాజుపై చర్యలు తీసుకోవాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ జహీరాబాద్ మండలం పరిధిలో గుర్తింపులేకుండా కొనసాగుతున్న శాంతినికేతన్ విద్యాలయం, లైజియం సీబీఎస్ఈ స్కూల్, శ్రీచైతన్య, బ్రిలియంట్ పబ్లిక్‌స్కూల్, విద్యాభారత్ హైస్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎంఈఓపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహిళల భద్రతే షీటీం బాధ్యత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బాలికలు, మహిళల భద్రతే షీటీం లక్ష్యమని మియాపూర్ షీటీం ఎస్ఐ పోచయ్య తెలిపారు. సోమవారం రాత్రి తెల్లాపూర్‌లో మహిళ భద్రతపై సైబరాబాద్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాలికలను, మహిళలను, వృద్ధులను గౌరవించాలని సూచించారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం సీఐ సంజయ్, ఎస్ఐ శశికాంత్‌రెడ్డి, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి, నాయకులు ఇంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పోలీసు అధికారులు, నాయకులు

ముత్తంగి గ్రామంలో కుక్క హల్‌చల్

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని ముత్తంగి గ్రామంలో ఓ కుక్క హల్‌చల్ చేస్తుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గత రెండు రోజుల క్రితం ముత్తంగి గ్రామంలో పిల్లలను తీసిన కుక్క నలుగురిని గాయపర్చగా సోమవారం మరో ముగ్గురిని గాయపర్చిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సర్వమతాల సారం ఒక్కటే

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఎమ్మెల్యేతో వరప్రసాద్‌రెడ్డి, నాయకులు

పటాన్‌చెరు: ఒకే రోజు దేవాలయం, చర్చి, మసీదు నిర్మాణాలకు శంకుస్థాపన చేసి రూ.10 లక్షల చొప్పున 30 లక్షల విరాళాలు ప్రకటించి పరమత సహనానికి మారుపేరుగా నిలిచారు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి. అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ పరిధిలోని బీహెచ్ఇఎల్ మెట్రో ఎంక్లేవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలలో నూతనంగా నిర్మించతలపెట్టిన పోచమ్మ దేవాలయం, మసీదు, చర్చి నిర్మాణ పనులకు ఆదివారం సాయంత్రం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలవారిని సమానంగా చూస్తూ వారి సంక్షేమమే లక్ష్యంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సునీతాసత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

జిన్నారం(పటాన్‌చెరు): కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బొల్లారం పారిశ్రామికవాడలోని హార్టెక్స్ రబ్బర్ పరిశ్రమలో నిర్వహించిన కార్మిక యూనియన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్మిక విభాగం నేత వరప్రసాద్‌రెడ్డి అధిక మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా సోమవారం వరప్రసాద్‌రెడ్డిని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అభినందించారు.

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని మంబాపూర్ గ్రామంలో మల్లికార్జునస్వామి, మంబాపూర్‌లో బీరప్పస్వామి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ ప్రవీణపాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు



ఇఫ్తార్‌విందులో నీలం మధు

పటాన్‌చెరు టౌన్: మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్‌విందు అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోనిన చిట్కుల్ గ్రామంలోని ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎండీ కాజామీయా, అబ్దుల్ రఫీక్, యూసుఫ్, ఎండీ సిరాజ్, రజాక్, రియాజ్, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో నిర్వహించనున్న బీరప్ప జాతర ఉత్సవాలకు చిట్కుల్ సర్పంచ్ నీలం మధు రూ.50వేల విరాళాన్ని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన నగదును ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గ్యారాల మల్లేష్ సోమవారం ఉత్సవాల నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా నీలం మధుకు ఉత్సవాల నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు మల్లేశ్‌యాదవ్, నర్సింలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూముల చదును పనులు నిలిపివేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని సర్వేనంబర్ 1లో రైతుల అనుమతులు లేకుండా చదును పనులు చేయటం సరైందికాదని, తక్షణమే పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్ ఆధ్వర్యంలో రైతులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుట్టి భాస్కర్ మాట్లాడుతూ సర్వేనంబర్ 1లో రైతుల అనుమతులు లేకుండా హెచ్ఎండీఏ అధికారులు చదును పనులు చేస్తున్నారన్నారని మండిపడ్డారు. కొంతమంది రైతులు మాత్రమే అనుకూలంగా ఉన్నారని, అనుకూలంగా లేని రైతులకు సంబంధించిన భూములను కూడా చదును చేసేవిధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పనులను నిలిపివేసి పూర్తిస్థాయి విచారణ చేపట్టిన తర్వాతే పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

జిల్లా వ్యాప్తంగా ఐకేపీ వీఓఏలు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఐకేపీ వీఓఏలకు ఇచ్చిన హామీ మేరకు వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన నిరవధిక సమ్మెకు ఐకేపీ వీఓఏలు అధికసంఖ్యలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించాలని నినదించారు.



జిన్నారం: సమ్మె చేస్తున్న ఐకేపీ వీఓఏలు



హత్నూర: నిరసన తెలుపుతున్న వీఓఏలు



కొండాపూర్‌లో...



కోహీర్‌లో...



జోగిపేటలో..



పటాన్‌చెరు టౌన్‌లో...

సంక్షిప్త వార్తలు

◆ గొర్రెల పంపిణీని సద్వినియోగం చేసుకోవాలి

రాయికోడ్(అందోల్) గొల్లకుర్మలు రెండోవిడత గొర్రెల పంపిణీని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని ఆయా గ్రామాల్లో అనారోగ్యంతో మృతి చెందిన పలువురి కుటుంబసభ్యులకు రూ.20వేల ఆర్థికసాయాన్ని మాజీ ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి సోమవారం అందజేశారు.

◆ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నర్సింగ్‌రావు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పుట్ట నర్సింగ్‌రావును నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పుట్ట నర్సింగ్‌రావును ఘనంగా సన్మానించారు.

◆ గడువుతీరిన వాహనాలు నడిపితే చర్యలు

నారాయణఖేడ్: గడువుతీరిన వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని నారాయణఖేడ్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రవాణాశాఖ నిబంధనల ప్రకారం గడువుతీరిన వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

◆ పాలిటెక్నిక్ ప్రవేశానికి ఉచిత శిక్షణ

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు ఉచిత పాలిటెక్నిక్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాఠశాల ముత్తంగి హెచ్ఎం శారద తెలిపారు. మండల పరిధిలోని ముత్తంగిలో పోతుకూచి సోమసుందర సామాజికసేవా సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలు రాసిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం ఉచిత పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష శిక్షణను ప్రారంభించారు. ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భారతినగర్ కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియాకాలనీలో కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో విద్యుత్‌స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, నీటి కాలువలపై స్లాబ్ వేయాలని తదితర సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టి తీసుకురాగా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

◆ ప్రజలతో ముఖాముఖి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కానుకుంటలో సోమవారం ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సకాలంలో తాగునీరు రావడంలేదని, రోడ్డు మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని కార్పొరేటర్ పుష్పనగేష్ వివరించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ గ్రామంలో ఆదివారం రాత్రి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ హకీం, సర్పంచ్ జయంతిశ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, నాయకులు జగన్‌యాదవ్, ఆంజనేయులు, వెంకటేశం పాల్గొన్నారు.

◆ మనబిన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

సదాశివపేట(సంగారెడ్డి): పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని మనబిన్ ఫౌండేషన్ చైర్మన్ ప్రముఖ న్యాయవాది ఎండి, ముకీం, కౌన్సిలర్ ఇలియాజ్ షరీఫ్‌ల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పట్టణంలోని పిట్టలకేరీ మసీదు వద్ద ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీజేఏసీ జిల్లా కన్వీనర్ కొత్తగొల్ల సత్తయ్యయాదవ్, మనబిన్ ఫౌండేషన్ నాయకులు మునిపల్లి రమేష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు గొంగ్లూరి ప్రభు పాల్గొన్నారు.

◆ రేపు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మండలంలోని దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు ఆర్టీసీ మార్కెటింగ్ ఇన్‌చార్జి పాండు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్‌పాస్ మేళాకు వచ్చే దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్, ఫోటోతో పాటు రూ.50 వెంట తీసుకొని రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండలానికి చెందిన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ పీఏసీఎస్ చైర్మన్‌గా మచ్చేందర్

జహీరాబాద్: మండలంలోని ఇప్పపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా హోతి(బి) డైరెక్టర్ మచ్చేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన ఎన్నికకు 8 మంది సభ్యులు హాజరయ్యారు. వైస్‌చైర్మన్‌గా మన్నాపూర్ డైరెక్టర్ హరిసింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు చైర్మన్‌గా ఉన్న కిషన్‌రావు పవార్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో తీర్మానం నెగ్గింది. దీంతో చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారిగా డీసీఓ ప్రసాద్ వ్యవహరించారు. చైర్మన్‌గా ఎన్నికైన మచ్చేందర్‌ను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములు అభినందించారు.

అంబలితో సంపూర్ణ ఆరోగ్యం



కల్హేర్(నారాయణఖేడ్): అంబలితో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కల్హేర్ నాయబ్ తహసీల్దార్ సయ్యద్ ఉమర్ పాషా అన్నారు. కల్హేర్‌లో కిషన్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రం, చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమర్‌పాషా దాత కిషన్‌రావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గిర్దావర్ ప్రమోద్, సర్పంచ్ పెరుమాండ్ల లచ్చవ్వ, పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి పాల్గొన్నారు.